క్లుప్తంగా

శ్రీశైలంప్రాజెక్ట్‌లో పోలీసుల కవాతు



సున్నిపెంట వీధుల్లో కవాతు చేస్తున్న పోలీసులు

శ్రీశైలంప్రాజెక్ట్: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజల రక్షణ కోసం మేమున్నామంటూ శుక్రవారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలో పోలీసులు కవాతు నిర్వహించారు. మండలంలో ఎన్నికలు ముగిసే వరకూ స్థానిక పోలీస్ అధికారులు, పోలీసులు, వారితో పాటు అదనపు బలగాలైన 30 మంది బార్డర్ సెక్యూరిటీ ఫోర్స్ పోలీసులు గస్తీ నిర్వహిస్తారన్నారు. ఎవరైనా ప్రజలను ప్రలోభాలకు గురిచేయడం, భయభ్రాంతులకు గురిచేయడం వంటివి చేస్తే తమ దృష్టికి తీసుకు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమేష్‌కుమార్ తెలిపారు.

కొలతల ప్రకారం పని చేయాలి

కొత్తపల్లి: కొలతల ప్రకారం పనులు చేస్తేనే కనీస వేతనం వర్తిస్తుందని ఏపీఓ రేష్మ తెలిపారు. శుక్రవారం మండలంలోని దుద్యాల గ్రామం సమీపంలో జరుగుతున్న ఉపాధి హామీ పనుల వద్ద కూలీలతో రోజ్‌గార్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఏ గ్రామానికి ఏఏ పనులు అవసరము, వచ్చేవారంలో ఎంత మందికి పనికల్పించబోతున్నాము తదితర విషయాలపై కూలీలకు అవగాహన కల్పించారు.

వైభవంగా నాభిశిల ప్రతిష్ఠ

పగిద్యాల: మండలంలోని అర్లపాడు, నెహ్రూనగర్ గ్రామాల్లో శుక్రవారం నాభిశిల, ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ఠ వేడుకలను ప్రజలు ఘనంగా నిర్వహించారు. మూడు రోజుల పాటు కొనసాగుతున్న ప్రతిష్ఠ మహోత్సవ వేడుకలను పురోహితులు ఉమ శాస్త్రోక్తంగా జరిపించి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆడపడుచుల సందడితో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. నూతన వస్త్రాలు, ఒడి బియ్యం ధరించిన మహిళలు నాభిశిలను సందర్శించి భక్తితో పూజించి ప్రదక్షణ చేశారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

మిడుతూరు: మండలపరిధిలోని అలగనూరు గ్రామానికి చెందిన శేఖర్ అనే వ్యక్తి నుంచి 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్ మోహన్ శుక్రవారం తెలిపారు.

కేసు నమోదు

పగిద్యాల: స్టేషన్ పరిధిలోని లక్ష్మాపురం గ్రామానికి చెందిన నాగరాజు తన కొడుకును ఇంటికి ఎదురుగా బహిరంగ ప్రదేశంలో బహిర్భూమికి కూర్చోబెట్టి కలుషితం చేస్తున్నాడని అదే గ్రామానికి చెందిన దాసర అయ్యన్న, చిన్నయ్య, మరియమ్మ కట్టెలతో దాడి చేశారు. దాడిలో గాయాలకు గురైన బాధితుడు నాగరాజు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ ఎస్ఐ జయశేఖర్ శుక్రవారం తెలిపారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న రమేష్‌నాయుడు, నాయకులు

పగిద్యాల: మే 13న సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని మండల సచివాలయ కన్వీనర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు ఓటర్లను కోరారు. శుక్రవారం మండల పరిధిలోని పడమర ప్రాతకోట గోరంట్ల ఎస్సీ కాలనీ నుంచి ఇంటింటి ప్రచారం చేపట్టారు. స్థానిక మోక్షేశ్వర, నందీశ్వర, కాశీశ్వర స్వామి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఐదేళ్ల జగనన్న పాలనలో పేదల జరిగిన అభ్యున్నతిని వివరిస్తూ ఓటర్లలో ఉత్సాహాన్ని నింపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ బోరెల్లి శ్యామలమ్మ, సింగిల్‌విండో డైరెక్టర్ దివాన్‌సాహెబ్, కో ఆప్షన్ సభ్యులు అస్లాంబాషా, ఉప సర్పంచ్ లక్ష్మీదేవమ్మ, వార్డు సభ్యులు అమీర్ బాషా, మొలకల రత్నమ్మ, నాయకులు నాగేశ్వరరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తర్తూరులో భక్తుల రద్దీ



జడ్జి వందనకు తీర్థప్రసాదాలు అందజేస్తున్న దృశ్యం

జూపాడుబంగ్లా: తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామివారి బ్రహ్మోత్సవాలు ముగిసినా స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తుల తాకిడి కొనసాగుతూనే ఉంది. పది, ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలు వెలువడటంతో ఉత్తీర్ణులైన విద్యార్థులు వారి తల్లిదండ్రులను వెంటబెట్టుకొని తర్తూరు జాతరకు వస్తుండటంతో స్వామి, అమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు.

స్వామివారిని దర్శించుకున్న జడ్జి

కర్నూలు జూనియర్ సివిల్ జడ్జి, నందికొట్కూరు జూనియర్ కోర్టు ఇన్‌చార్జ్ జడ్జి వందన శుక్రవారం తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈఓ వెంకటరమణ జడ్జికి సాదరంగా స్వాగతం పలికారు. వారు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించుకున్న అనంతరం ఈఓ స్వామివారి తీర్థప్రసాదాలు అందజేయగా అర్చకులు ఆశీర్వాదాలు పలికారు.

ఎన్ని పార్టీలు ఏకమైనా జగన్ వెంటే జనం

- పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకునేందుకు రెండు బటన్లు నొక్కాలి
- సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



సంతజూటూరులో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి.



ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా

మహానంది: ఎన్ని పార్టీలు ఏకమైనా జనం జగన్ వెంటే ఉన్నారని, కూటమి కుట్రలను తిప్పి కొట్టేందుకు ప్రతి ఒక్కరూ ఏకం కావాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పిలుపునిచ్చారు. బండిఆత్మకూరు మండలం నారాయణపురం, చిన్నదేవలాపురం, సంతజూటూరు, భోజనం, పరమటూరు, పెద్ద దేవలాపురం గ్రామాల్లో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోలో ఎమ్మెల్యే శిల్పా మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నిష్పక్షపాతంగా, పారదర్శకంగా పాలన సాగిస్తూ అమలు చేసిన సంక్షేమ పథకాలతో పేదలకు ఆర్థిక భరోసా లభించిందన్నారు. నవరత్నాల ద్వారా పేదల ఆర్థిక స్థితిగతులను మార్చిన ఏకైక సీఎం జగన్ మాత్రమే అని కొనియాడారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చారని, ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించాలి కోరారు. పేదల ప్రభుత్వాన్ని నిలబెట్టుకోవడం కోసం ఫ్యాన్ గుర్తుపై రెండు సార్లు బటన్లు నొక్కాలని ప్రజలను విజ్ఞప్తి చేశారు. 14ఏళ్ల సీఎంగా పనిచేసిన చంద్రబాబునాయుడు పేదలకు ఏనాడూ మంచి పనులు చేయలేదని, అందుకే నేడు పొత్తులతో ప్రజల ముందుకు వస్తున్నారని, ఆయన మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. చంద్రబాబు జన్మభూమి కమిటీల పేరుతో ప్రజలను మోసం చేశారని, ఏ చిన్న పని కావాలన్నా నేతల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. జగనన్న ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థతో ప్రజల పనులు ఇంటి వద్దనే సులువుగా జరుగుతున్నాయన్నారు.

బూతులు తిట్టే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అవసరమా...?

ఐదేళ్లకు ఒకసారి ఓట్ల సమయంలో ప్రజల మధ్యకు వస్తూ బూతులు తిట్టే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి మనకు అవసరమా అంటూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ప్రశ్నించారు. ఐదేళ్లపాటు ప్రజా సంక్షేమాన్ని గాలికొదిలేసి కేవలం ఎన్నికల సమయంలో ఓట్ల కోసం వచ్చే సీజనల్ పొలిటికల్ లీడర్ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి అని విమర్శించారు. మీ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అలా కాదని, ఏడాది పాటు ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపద వచ్చినా, ప్రమాదాలు జరిగినా, ఎవరైనా అనారోగ్యంతో ఆస్పత్రులకు వెళ్లినా నా వంతు సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నానని చెప్పారు. గ్రామాల్లో పర్యటించే సమయంలో అండగా నిలిచిన తీరు అందరికీ తెలిసిందే అన్నారు. తెలుగుగంగ కాల్వ నుంచి సాగునీటి కోసం లస్కర్‌లాగా పనిచేశానని, రైతుల కోసం అధికారంలో ఉన్నా ప్రతిపక్ష పాత్ర పోషించానని గుర్తు చేశారు. నారాయణపురంలో రూ. 3 కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. కార్యక్రమాల్లో నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు బారెడ్డి శ్రీనివాసరెడ్డి, జేసీఎస్ పుల్లారెడ్డి, ముఖ్య నాయకులు భూమా రఘునాథరెడ్డి, కొంగీస శివశంకర్, ఎంపీటీసీ చైతన్య, సర్పంచ్ బారెడ్డి భాస్కరరెడ్డి, మాజీ జెడ్పీటీసీ మద్దిలేటి, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ విక్రమసింహా నాయక్, పరమటూరు సర్పంచ్ జగన్‌మోహన్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ శివలింగం, చిన్నదేవలాపురం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల కులస్తులకు న్యాయం చేసింది సీఎం జగనే



శిల్పా కార్తీక్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న నూర్‌బాషా దూదేకుల కులస్తులు

ఆత్మకూరు: నూర్‌బాషా దూదేకుల కులస్తులకు న్యాయం చేసింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డేనని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్ రెడ్డిని కలిశారు. బాజీ మాట్లాడుతూ శిల్పా చక్రపాణిరెడ్డికి నూర్‌బాషా దూదేకుల కులస్తులందరూ మద్దతు ఇవ్వాలని, వచ్చే నెల 13న జరగబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. దూదేకుల కులాన్ని అవమానకరంగా మాట్లాడితే చట్టపరమైన చర్యలు తీసుకునేవిధంగా జీవో తీసుకొచ్చిన ఏకైక ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. కార్యక్రమంలో షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ అంజాద్ అలీ, పశ్చిమగోదావరి జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ నసీరుద్దీన్, నియోజకవర్గ అధ్యక్షుడు మహబూబాషా పాల్గొన్నారు.

సంక్షేమ సారథికి పట్టం కట్టండి



వెలుగోడులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న శిల్పా శ్వేతారెడ్డి

వెలుగోడు: సంక్షేమ సారథికి పట్టం కట్టాలని శ్రీశైలం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి కుమార్తె శ్వేతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె పట్టణంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చౌడేశ్వరి దేవి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం మండ్ల పేట, చెన్నకేశవస్వామి గుడి, అమ్మవారిశాల, రెడ్డి వీధుల్లో పర్యటించి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ..డ్వాక్రా రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి వెనుదిరిగిన వ్యక్తి చంద్రబాబు అని, ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా రుణమాఫీ చేసిన సీఎం జగన్ మోహన్ రెడ్డి అన్నారు. వృద్ధులపై కక్ష గట్టి హైకోర్టులో పిటిషన్ వేసి వలంటీర్ ద్వారా పింఛను అందకుండా చేసిన నాయకుడు చంద్రబాబు కావాలా..మీ ఇంటికి వచ్చి ఉదయాన్నే పలకరించి సంక్షేమ పథకాలు ఇప్పించే జగన్‌మోహన్ రెడ్డి కావాలా తేల్చుకోవాలన్నారు. అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డిని మళ్లీ గెలిపించుకొని జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా శిల్పాను, ఎంపీగా పోచాను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ గ్రామ నాయకులు మాలిక్, జోత్స్న, నసిరుల్లాఖాన్, చంద్రశేఖర్‌రెడ్డి, అంకన్న తదితరులు పాల్గొన్నారు.

సైనికుల్లా పని చేయాలి



మాట్లాడుతున్న బుడ్డా శేషారెడ్డి

వెలుగోడు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో శ్రీశైలం నియోజకవర్గం గణనీయమైన అభివృద్ధిని సాధించిందని, అభివృద్ధి కొనసాగాలంటే పార్టీ నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో సైనికుల్లా పని చేసి ఎన్నికల్లో గెలిపించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి బుడ్డా శేషారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలకు ఎన్నికల ప్రచారంపై బుడ్డా శేషారెడ్డి దిశానిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పిన సంక్షేమ, అభివృద్ధి పథకాలన్నింటినీ పూర్తిస్థాయిలో అమలు చేశాకే ప్రజల ముందుకు వస్తున్నారన్నారు. నేను మంచి చేసి ఉంటేనే మీరందరూ ఓటేయ్యాలని అడుగుతున్నారంటే ఆయన ధైర్యం ప్రజలేనని అన్నారు. 2014 ఎన్నికల్లో చంద్రబాబు 100 పేజీల మేనిఫెస్టోలో 600 హామీలను ఇచ్చారని, వాటిలో ఏ ఒక్కటి అమలు చేయకపోగా.. కుట్రపూరితంగా అధికారంలోకి రావాలని నేడు తప్పుడు హామీలతో ప్రజల ముందుకు వస్తున్నాడన్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి 15రోజుల క్రితం మహానేత వైఎస్సార్ ప్రవేశపెట్టిన మైనారిటీ రిజర్వేషన్ తీసేస్తామని చెప్పిందని, ఇదే విషయాన్ని తెలంగాణ ఎన్నికల్లో అమిత్‌షా ప్రస్తావించారన్నారు. మైనారిటీలకు అండగా ఉన్న 4శాతం రిజర్వేషన్‌ను బీజేపీ తొలగించే ఆలోచనలో ఉందని, సీఏఏ అమలు జరిగితే వారికి ఓటుహక్కు లేకుండా చేసేస్తారన్నారు. మైనారిటీల సంక్షేమం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమన్నారు. శ్రీశైలం నియోజకవర్గ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డి, నంద్యాల ఎంపీ అభ్యర్థి పోచా బ్రహ్మానందరెడ్డిలను అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడం మనందరి బాధ్యత అన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ దేశం తిరుపంరెడ్డి, మాజీ సర్పంచ్ అల్లె తిరుపాల్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, సర్పంచులు వేల్పుల జయపాల్, బ్రహ్మానందరెడ్డి, కుళాయిస్వామిరెడ్డి, నాగేశ్వరరెడ్డి, బోగోలు సుదర్శనం, శ్రీనివాసులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

జూపాడుబంగ్లా: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో విధులు నిర్వహిస్తున్న 107 మంది వలంటీర్లు ఇప్పటి వరకు రాజీనామా చేశారని ఎంపీడీఓ నూర్జహాన్ తెలిపారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ 11 సచివాలయా పరిధిలో 186 మంది వలంటీర్లు ఉండగా ఇప్పటి వరకు 107 మంది తమ సెల్‌ఫోన్‌లు, సిమ్ కార్డ్స్, స్కానర్లు అప్పగించి రాజీనామా పత్రాలు ఇచ్చారన్నారు. ఇంకా 79 మంది వలంటీర్లు విధుల్లో కొనసాగుతున్నారని ఎంపీడీఓ పేర్కొన్నారు.

30 మంది రాజీనామా

పగిద్యాల: స్థానిక సచివాలయం 1, 2, 3 పరిధిలోని వలంటీర్లు 30 మంది శుక్రవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. పంచాయతీ కార్యదర్శి ఉపేంద్రారెడ్డికి రాజీనామా పత్రాలను అందజేసి చంద్రబాబునాయుడుపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. వలంటీర్లు అందరం ఐకమత్యంతో మేలో జరిగే ఎన్నికల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మళ్లీ ఏర్పాటు చేసుకునేందుకు పనిచేస్తామని స్పష్టం చేశారు.

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని నాగటూరు గ్రామానికి చెందిన 11 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారు తమ రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబుకు అందజేశారు. రాజీనామా చేసిన వారిలో నరేష్, విజయ్, చిన్నస్వాములు, శ్రీకాంత్, ప్రశాంతి, రాబియా,వేణమ్మ, దుర్గమ్మ, మంజుల, హైమావతి,రాజేశ్వరి ఉన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామాలు

కొత్తపల్లి: మండలంలో గ్రామ వలంటీర్ల రాజీనామాలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మండలంలోని కొక్కెరంచ గ్రామానికి చెందిన నలుగురు వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీఓ జవహర్ బాబుకు అందజేశారు.

తరిగోపుల ఫీల్డ్ అసిస్టెంటు రాజీనామా

జూపాడుబంగ్లా: తరిగోపుల జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ఫీల్డ్ అసిస్టెంటు బాలస్వామి రాజీనామా చేసినట్లు ఎంపీడీఓ నూర్జహాన్, ఏపీఓ గౌరీబాయి తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంటు బాలస్వామి స్వచ్ఛందగా తన విధులకు రాజీనామా చేస్తున్నట్లు లిఖితపూర్వకంగా తెలియజేశారన్నారు. ఆయన రాజీనామాను ఆమోదించేందుకు ఉపాధిహామీ పథకం ప్రాజెక్టు డైరెక్టర్‌కు పంపనున్నట్లు తెలిపారు.

నేడు నందికొట్కూరులో బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎన్నికల ప్రచారం

నందికొట్కూరు: పట్టణంలో 20వ వార్డు కౌన్సిలరు హమీద్ ఇంటి నుంచి ఉదయం 8 గంటలకు శాప్ రాష్ట్ర చైర్మన్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఎన్నికల ప్రచారం నిర్వహిస్తునట్లు మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 2, 20, 28 వార్డుల్లో, సాయంత్రం 17, 27 వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపడతారన్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పోలింగ్ రోజు కార్మికులకు సెలవు

నందికొట్కూరు: సార్వత్రిక ఎన్నికలకు మే నెల 13న పోలింగ్ జరగనున్న సందర్భంగా కార్మికులు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం వేతనంలో కూడిన సెలవు మంజూరు చేసిందని నందికొట్కూరు సహాయక కార్మిక అధికారి వెంకటేశ్వర్ శుక్రవారం తెలిపారు. వివిధ దుకాణాల్లో, హోటళ్లు, పారిశ్రామిక సంస్థల్లో పని చేస్తున్న కార్మికులకు ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆయా యాజమాన్యాలు రాష్ట్ర కార్మిక కమిషనర్ ఆదేశాల మేరకు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తే యజమానులపై చట్ట పరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

జూపాడుబంగ్లా: ఎండల తీవ్రత నేపథ్యంలో భూగర్భజలాలు అడుగంటినా ఏ ఒక్క గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకొంటున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర తెలిపారు. కలెక్టర్ ఉత్తర్వుల మేరకు తాగునీరు, పశుసంవర్ధకశాఖ, విద్యుత్‌శాఖ, ఉపాధిహామీ పథకం అంశాలపై చర్చించేందుకు శుక్రవారం ఎంపీపీ సువర్ణమ్మ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఏఈ మాట్లాడుతూ తాగునీటి సౌకర్యార్థం కలెక్టర్ మండలానికి రూ.3లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ నిధులను వెచ్చించి గ్రామాల్లోని చేతిపంపులను మరమ్మతులు చేయించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ఎక్కడైనా తాగునీటి సమస్య నెలకొన్నట్లయితే తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. విద్యుత్ అధికారుల అనుమతి, ప్రమేయం లేకుండా సొంతంగా ప్రజలు, రైతులు విద్యుత్ పనులు చేసుకోవద్దని ట్రాన్స్‌కో ఏఈ రామాచారి సూచించారు. మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 4,565మందికి ఉపాధిపనులు కల్పిస్తున్నట్లు ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఈసీ నజీర్‌బాషా తెలిపారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తోకలకృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, కోఆప్షన్ అల్లావుద్దీన్, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్కూల్ బెంచీలు తరలించేయత్నం

మహానంది: బండిఆత్మకూరు మండలం జీసీపాలెం ఎయిడెడ్ పాఠశాలలో రాత్రికి రాత్రి 15 బెంచీలను తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్న ఘటన గురువారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు వెంకటరామిరెడ్డి, నరసింహారెడ్డి తదితరులు తెలిపిన వివరాల మేరకు స్థానిక ఎయిడెడ్ పాఠశాలలో 15బెంచీలను రిటైర్డు హెచ్‌ఎం నరసింహులు బండిఆత్మకూరులోని రాఘవేంద్ర విద్యాసంస్థల అధినేతకు విక్రయించినట్లు ఆరోపించారు. గ్రామస్తులు అడ్డుకోవడంతో బెంచీలను ఎత్తుకున్న ట్రాక్టర్‌ను అక్కడే వదిలేసి వెళ్లగా.. ఉదయం పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్, ఉప సర్పంచ్ లింగారెడ్డి ఆధ్వర్యంలో తిరిగి పాఠశాలలో చేర్పినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా ఈ తతంగం వెనుక స్థానిక టీడీపీ నేతల హస్తం ఉన్నట్లు గ్రామస్తులు ఆరోపించారు.

సంక్షేమ సారథిని మరోసారి గెలిపించుకుందాం



గాజులపల్లెలో ప్రచారం నిర్వహిస్తున్న పక్కీరయ్య



బండిఆత్మకూరులో ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి గెలిపించుకుంటేనే పేదల ఆర్థికాభివృద్ధి సాధ్యమని సింగారెడ్డి వాణి, బండిఆత్మకూరు మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి అన్నారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని జ్ఞప్తి చేశారు. ఎస్పీడీసీఎల్ రాష్ట్ర డైరెక్టర్ శశికళారెడ్డి, ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ యూత్ విభాగం అధ్యక్షుడు దీప్‌కాంత్‌రెడ్డి, నాయకులు బాబురెడ్డి, కృష్ణమల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. మహానంది మండలం గాజులపల్లెలో గోపవరం సొసైటీ చైర్మన్ గాజులపల్లె కిట్టు ఆధ్వర్యంలో, ఏపీ మదాసీ కురువ రిజర్వేషన్ పోరాట సమితి నియోజకవర్గ కన్వీనర్, వైఎస్సార్‌సీపీ నేత గజ్జ పెద్ద పక్కీరయ్య , కొండా మధు సూదన్ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

నామినేషన్ల పరిశీలన పూర్తి



నామినేషన్లను పరిశీలిస్తున్న ఆర్వో సుధారాణి

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం శ్రీశైల అసెంబ్లీ నియోజకవర్గానికి అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి సుధారాణి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మొత్తం 41 నామినేషన్లను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. ఇందులో 1, 6, 14, 27 నామినేషన్లు చక్రపాణిరెడ్డి (వైఎస్సార్ సీపీ అభ్యర్థి) నామినేషన్ పత్రాలను ఆమోదించారు. అలాగే 2, 11, 28 చింతల నాగేశ్వరరావు (జాతీయ చేతివృత్తిదారుల ఐక్యవేదిక పార్టీ అభ్యర్థి), 5, 15, 30 నామినేషన్ల సెట్‌లు సయ్యద్‌మహ్మద్ సికిందర్‌బాషా (జైభారత్ నేషనల్ పార్టీ అభ్యర్థి), 8, 31 సెట్లు నామినేషన్‌లు పల్లె చంద్రశేఖర్ (బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థి), 10, 24 సెట్లు మహ్మద్ యూనూస్ (సోషియల్ డెమోక్రసీ పార్టీ ఆఫ్ ఇండియా), 12వ సెట్ పెద్దిరెడ్డి గంగాధరరెడ్డి (ఇండిపెండెంట్ అభ్యర్థి), 13, 22 సెట్లు మునగాల నాగమల్లికార్జునరెడ్డి (ఇండిపెండెంట్ అభ్యర్థి), 16వ సెట్ ఇలియాస్ (ఇండిపెండెంట్ అభ్యర్థి), 17, 38 ఆసర సయ్యద్‌ఇస్మాయిల్ (ఇండియన్ నేషనల్ కాంగ్రెస్), 19వ సెట్ నామినేషన్ అల్ల ఈశ్వర్‌రెడ్డి (ఇండిపెండెంట్), 23, 41 సెట్లు జి.మల్లికార్జున(నేషనల్ మహాసభ పార్టీ), 32వ సెట్ జయనారపురెడ్డి(జాతీయ జనసేన పార్టీ), 34వ సెట్ లోకేశ్వర్‌రెడ్డి (జై హిందుస్థాన్ పార్టీ), 39వ సెట్ తిమ్మయ్య(ఇండిపెండెంట్), 3, 9, 20వ సెట్ బుడ్డా రాజశేఖర్‌రెడ్డి (టీడీపీ అభ్యర్థి), మధు (సమాజ్‌పార్టీ), జయకుమారస్వామి (ఇండిపెండెంట్), 25వ సెట్ మధుగౌడ్ (నవభారతి నిర్మాణ సేవా పార్టీ), 26, 33వ సెట్ సుస్మిత (జయభారత్‌రావు భారతీయ పార్టీ)ల నామినేషన్ పత్రాలు సక్రమంగా ఉన్నాయని తెలిపారు. 4, 37 బుడ్డా శైలజ టీడీపీ తరపున వేసిన పత్రాలను తిరస్కరించినట్లు చెప్పారు. 7, 29వ సెట్‌లు శిల్పా కార్తీక్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ తరపున వేసిన నామినేషన్‌లను తిరస్కరించామన్నారు. 35వ సెట్ నాగస్వామినాయక్, 36వ సెట్ మహ్మద్‌బాషా, 40వ సెట్ రాజమ్మల నామినేషన్లను తిరస్కరించినట్లు ఆమె వెల్లడించారు.

14 నామినేషన్ల తిరస్కరణ

నందికొట్కూరు: నందికొట్కూరు అసెంబ్లీ స్థానానికి వేసిన 14 నామినేషన్లు తిరస్కరించినట్లు ఆర్‌ఓ దాసు శుక్రవారం తెలిపారు. ఏడుగురికి చెందిన 14 నామినేషన్లకు సంబంధించి సరైన పత్రాలు సమర్పించకపోవడంతో తిరస్కరించినట్లు వెల్లడించారు. 21 మందికి చెందిన 33 నామినేషన్లు నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉన్నాయని చెప్పారు.

విస్తృతంగా ఎన్నికల ప్రచారం



పట్టణంలోని 6వ వార్డులో ఇంటింటి ప్రచారం చేస్తున్న శిల్పా భాగ్యలక్ష్మి



13వ వార్డులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కో-ఆప్షన్ సభ్యులు రషీద్

ఆత్మకూరు: పట్టణంలో ఇంటింటి ప్రచారం శుక్రవారం ఊపందుకుంది. పట్టణంలోని 78వ బూత్, 6వ వార్డులో స్థానిక ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి సతీమణి శిల్పా భాగ్యలక్ష్మి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పేద, బడుగు, బలహీనవర్గాల ప్రభుత్వమని, పేదలు అభివృద్ధి చెందాలంటే తిరిగి జగనన్న ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఆత్మకూరు పట్టణంలో అన్నివార్డుల్లో సీసీ రోడ్లు నిర్మించామని, త్వరలోనే డ్రైనేజీ, ఇంటింటికీ కుళాయి కనెక్షన్ మంజూరు చేస్తామన్నారు. వచ్చే ఎన్నికల్లో తన భర్త శిల్పా చక్రపాణిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ముఫ్తినూర్ మహ్మద్, మహీద్‌ముస్తఫా, ఇస్మాయిల్ జబీబుల్లా, అహ్మద్‌రసూల్, చాపల రఫిక్ పాల్గొన్నారు.

13వ వార్డులో..

పట్టణంలోని 13వ వార్డులో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి శిల్పా చక్రపాణిరెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆత్మకూరు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు రషీద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. అబ్జర్వర్ ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ పేదలకు సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆదరించాలన్నారు. ఎమ్మెల్యేగా శిల్పచక్రపాణిరెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మొమిన్ వహీద్, హుజూస్, వార్డు కౌన్సిలర్లు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నతోనే రైతన్నల అభ్యున్నతి



పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి

జూపాడుబంగ్లా: జగనన్నతోనే రైతుల అభివృద్ధి సాధ్యమవుతుందని తర్తూరు సర్పంచ్ పెద్దముంతల నాగిరెడ్డి అన్నారు. తర్తూరు శ్రీలక్ష్మీరంగనాథ స్వామి జాతరను పురస్కరించుకొని శుక్రవారం అంతర్‌రాష్ట్రస్థాయి న్యూకేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలను ప్రారంభించారు.

ప్రకాశం జిల్లా వృషభాల జయకేతనం

అంతర్‌రాష్ట్రస్థాయి ఎద్దుల బండలాగుడు పోటీల్లో ప్రకాశం జిల్లా, గంగన్నపాలెంకు చెందిన ఉమారెడ్డి, శ్రీవల్లిల ఎద్దులు మొదటిస్థానంలో నిలిచి రూ.50వేలు గెలుపొందాయి. పాణ్యం మండలం, కొత్తూరుకు చెందిన బీరంబుల్స్ ద్వితీయస్థానంలో రూ.40వేలు, తెలంగాణ రాష్ట్రం, గద్వాల జిల్లా, గొర్లఖాన్‌దొడ్డికి చెందిన కుర్వక్రెప్ప ఎద్దులు తృతీయస్థానంలో రూ.30వేలు కైవసం చేసుకొన్నాయి. పాణ్యం మండలం, కొత్తూరుకు చెందిన బీరం బుల్స్ రెండోజత నాల్గొవస్థానంలో రూ.20వేలు, పగిద్యాల కోరల గిరిజ వృషభాలు ఐదొ స్థానంలో రూ.15వేలు, అనంతపురం జిల్లా, పామిడికి చెందిన కరణం కృష్ణ ఎద్దులు ఆరొవ స్థానంలో రూ.10వేలు, ఆళ్లగడ్డ మండలం, కోటకందుకూరు లక్ష్మీశరణ్యారెడ్డి వృషభాలు ఏడవస్థానంలో రూ.8వేలు, మిడుతూరు మండలం, వీపనగండ్లకు చెందిన చెన్నయ్య ఎద్దులు ఎనిమిదో స్థానంలో నిలిచిరూ.5వేలు గెలుపొందాయి. విజేతలైన ఎద్దుల యజమానులకు సర్పంచ్‌తో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు పెద్దముంతల మహేష్, సుంకిరెడ్డి, పుల్లారెడ్డి, పీఎం శ్రీనివాసరెడ్డి, రంగారెడ్డి, వలిబాషా, పీఎం శివశంకర్‌రెడ్డి, బి.సుంకిరెడ్డి, ఎం.పాండురంగస్వామి, బి.రఘునాథరెడ్డి బహుమతులు అందజేశారు.

గురుకుల ప్రవేశాలకు 29న కౌన్సెలింగ్

పగిద్యాల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో 5వ తరగతి ప్రవేశం కోసం మిగులు సీట్ల భర్తీకి ఈనెల 29న ఉమ్మడి కర్నూలు జిల్లాకు సంబంధించి దిన్నెదేవరపాడు (జగన్నాథ గట్టు) గురుకుల పాఠశాలలో విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రమణమ్మ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 1:3 నిష్పత్తి ప్రకారం మార్కుల ఆధారంగా ఎంపిక ప్రక్రియ ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు మెరిట్ కార్డు, ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు జిరాక్స్‌లతో సోమవారం ఉదయం 8.30 గంటలకు హాజరు కావాలని సూచించారు. ఎస్సీ విద్యార్థులకు 47 నుంచి 18 మార్కుల వరకు, ఎస్టీ విద్యార్థులకు 37 నుంచి 19 మార్కుల వరకు, బీసీ విద్యార్థులు 47 నుంచి 42 మార్కుల వరకు వచ్చిన విద్యార్థులు కౌన్సిలింగ్‌కు అర్హులని పేర్కొన్నారు.

శ్రీశైలంలో నాటుసారా విక్రేత అరెస్టు

శ్రీశైలం : శ్రీశైలం టోల్‌గేట్ వద్ద నాటుసారా విక్రయిస్తున్న ప్రకాశం జిల్లా మర్రిపాలెం గ్రామానికి చెందిన వీరన్న అనే వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ జి.ప్రసాద్‌రావు శుక్రవారం తెలిపారు. సమాచారం మేరకు దాడిచేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఏఎస్ఐ గురవయ్య, పోలీసు సిబ్బంది ఉమా మహేష్, వెంకటనారాయణ, మహేష్, శివమహేంద్రారెడ్డి ఉన్నారు.